క్లుప్తంగా

మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సముదాయంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ శివాలయ ప్రతిష్ఠ, అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ పంచమ పుష్కర (షష్టాబ్ది) మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం ప్రచార వాల్‌పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు.

మరో విద్యుత్ ప్లాంట్ మంజూరు చేయించండి..

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో మరో 2800 మెగావాట్ల విద్యుత్ కర్మాగారం మంజూరుకు కృషి చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... 1999 నుంచి 2004 వరకు రిక్రూట్ అయిన ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కొత్త కర్మాగారాలు జెన్‌కో పరిధిలోనే నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. ఉమా మహేశ్వరరావు, యాస్మిన్, బ్రహ్మాజీ, మజీద్, రాధాకృష్ణ, సీతారామిరెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన



నూతన గ్రంథాలయం వద్ద డిగ్రీ విద్యార్థులు

ఇల్లెందురూరల్: ఇల్లెందులో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. పలురకాల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో స్థిరపడటానికి అవసరమైన అన్ని పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నట్లు చెప్పారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, డాక్టర్ రాకేష్ శ్రీరాం, డాక్టర్ వెంకటేశ్వరరావు, సరిత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అభివృద్ధి పనులు పూర్తి



మాట్లాడుతున్న నయీంఖురేషి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఉర్దూఘర్, షాదీఖానాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలో చుట్టుపక్కల ఆక్రమణలు తొలగిపోతాయని రాష్ట్ర మైనార్టీ నాయకులు, ఉర్దూఘర్ అధ్యక్షుడు నయీంఖురేషి అన్నారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కులమతాలకు అతీతంగా వీటిని శుభకార్యాలకు రూ.8000, నిరుపేదకు రూ.3000, సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలకు ఉచితంగా వినియోగించుకోచ్చని తెలిపారు. ఫ్యూస్ బస్తీలోని షాదీఖానా కూడా వినియోగంలోకి వస్తుందన్నారు.

చెక్కుల పంపిణీ

టేకులపల్లి: సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్ అన్నారు. ఈ మేరకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు బుధవారం కోయగూడెం గ్రామంలో మండలం తావుర్యాతండా, శంభునిగూడెం, రాంపురం పంచాయతీలకు చెందిన ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈది గణేష్, భూక్య సర్దార్, బానోతు భద్రు, రవి, లాకావత్ శ్రీను, మంగీలాల్, సురేశ్, బట్టు విజయ్, బన్సీలాల్, విజయ్, కోటి పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

పాల్వంచ: పోలీస్ స్టేషన్‌లో గొడవ చేసి, ఆందోళన చేపట్టిన సుమారు 20 మందిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 19వ తేదీన ఓ కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు పట్టణంలోని కొందరు చేరుకుని గోల చేసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళన చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో బుధవారం పోలీస్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవయ్య సుమారు 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై దాడిచేసిన వ్యక్తిపై..

కొత్తగూడెంఅర్బన్: దంపతులపై దాడి చేసిన వ్యక్తిపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కూలీలైన్ ప్రాంతంలో ఇడ్లీ బండి నడిపే రమేశ్ దగ్గరకు అదే ప్రాంతానికి చెందిన కోరి వచ్చాడు. రమేశ్ భార్యను దూషించాడు. రమేశ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఇంట్లోకి వెళ్లి రమేశ్ భార్యపై కూడా దాడి చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కోరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం..

జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోండి • ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య • రెండోరోజూ గ్రామసభల్లో ఆందోళనలు, నిరసనలు • సర్ది చెప్పిన అధికారులు

ఇల్లెందు: జాబితాలో పేర్లు లేవని ప్రజలు ముఖ్యంగా అర్హత ఉన్నవారు ఆందోళన చెందుతున్నారని, వారిలో అపోహలు తొలగించాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లెందులోని మార్కెట్ యార్డు, జగదాంబా సెంటర్‌లో జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ రైతు భరోసా కోసం ఇంటింటి సర్వే సందర్భంగా దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు జాబితాలో లేవని పలువురు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీ పథకాలు ప్రకటించిందని వాటి అమలుకు సాగుతున్న సర్వేలు, గ్రామసభల్లో అర్హులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడు పథకాల కోసం గ్రామసభలు ఏర్పాటు చేసిందని, అర్హులందరికీ ఈ మూడు పథకాలు లభిస్తాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సభల్లో పేర్లు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం 9,10,11,12,13,14,15,16 వార్డుల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, డీఈ మురళీ, కౌన్సిలర్లు, ఇందిరమ్మ వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: రేపల్లెవాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల జాబితా ప్రకటనలో భాగంగా బుధవారం మండలంలోని 11 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. రేపల్లెవాడ, పోలారం పంచాయతీలలో నిర్వహించిన గ్రామసభలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ప్రజలు చెప్పిన సమాచారాన్ని మాత్రమే సర్వే సిబ్బంది ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. ప్రజాపాలన, కులగణన సర్వే ఆధారంగా అర్హుల జాబితాను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఏమైనా తప్పులు దొర్లి ఉంటే గ్రామసభ అనంతరం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. మండలంలోని బాలాజీనగర్‌లో అర్హులకు అవకాశం లభించలేదని, సర్వే ఏకపక్షంగా చేశారని ఆరోపిస్తూ గ్రామసభకు హాజరైన ప్రజలు వేదికను చుట్టుముట్టి అధికారులను నిలదీశారు. దీంతో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ ప్రజలకు సూచించారు. గ్రామసభలలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏఓ సతీష్ పాల్గొన్నారు.

• మున్సిపాలిటీలో.. పంచాయతీ సభ

ఇల్లెందు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామసభలు ఏర్పాటు చేస్తుండగా అధికారులు ఇల్లెందులో వింత వైఖరి ప్రదర్శించారు. ఇందిరానగర్ గ్రామ పంచాయతీలోని గ్రామసభను మున్సిపాలిటీలోని 9,10,11 వార్డుల పరిధిలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయటం పట్ల ఇందిరానగర్ ప్రజలు, సీపీఎం నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మార్కెట్ యార్డులో గ్రామసభలో సీపీఎం నేతలు నబీ, ఆలేటి కిరణ్, కొడెం బోస్, ఎండీ అబ్బాస్, సోమ సుజాత, వజ్జా సురేష్‌లు అక్కడికి విచ్చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తెచ్చారు. ఇందిరానగర్‌లో జరగాల్సిన సభను మున్సిపాలిటీలో నిర్వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసించారు. అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పెసా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు.



అధికారులతో సీపీఎం నాయకుల వాగ్వాదం

• ఆందోళన చెందొద్దు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుని అర్హుల జాబితాలో పేర్లు రాలేదని ప్రజలు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, తెల్ల రేషన్‌కార్డు, ఇతర సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో రెండోరోజు బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రకటించిన అర్హుల జాబితాలో జరిగిన పొరపాట్లను సరిచేయాలన్నారు. వివాదాలు లేని జాబితాను సిద్ధం చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, తహసీల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



అర్హుల జాబితా ప్రకటిస్తున్న అధికారులు

• మా పేర్లు ఎందుకు రాలేదు?

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీలోని వార్డుల్లో రెండోరోజు బుధవారం జరిగిన వార్డు సభల్లో అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీశారు. పట్టణంలోని 3, 4, 7, 8, 18, 19, 22, 32, 35, 36 వార్డుల్లో వార్డు సభలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు అందరికీ రాలేదని, రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదని, గ్యాస్, విద్యుత్ బిల్లుల సబ్సిడీలు అందడం లేదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో మళ్లీ దరఖాస్తులను అందజేశారు. రెండో రోజు వార్డు సభలలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. అర్హత ఉన్నవారు ఇంకా చాలామంది ఉన్నారని, వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, తహసీల్దారు పుల్లయ్య, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, వార్డు స్పెషలాఫీసర్ రవీందర్, వార్డు ఆఫీసర్ హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నవీన్, రజిత, రమాదేవి, రాకేష్, మెప్మా ఆర్పీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



గుండెపుడిలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

• అధికారులను నిలదీసిన ప్రజలు

జూలూరుపాడు: సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాల్లో మా పేర్లు ఎందుకు రాలేదంటూ గ్రామసభల్లో ప్రజలు అధికారులపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. బుధవారం గుండెపుడి, వినోభానగర్, కరివారిగూడెం, కొమ్ముగూడెం, సురారం, మాచినేనిపేట, అన్నారుపాడు, కొత్తూరు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్దిదారుల జాబితాల్లో అనర్హుల పేర్లు ఎలా ఎంపిక చేశారని? అర్హులమైన మా పేర్లు ఎందుకు లేవని, సర్వే ఇష్టారాజ్యంగా చేశారని, ఒకే ఇంట్లో అందరికీ ఎలా సంక్షేమ పథకాలు ఇస్తారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ... జాబితాపై అభ్యంతరాల కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నామని, ఏ కారణం చేతనైనా జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కొత్తూరు గ్రామంలో గ్రామసభ సజావుగా జరగడం విశేషం. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ స్వాతిబిందు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

• దరఖాస్తులు నిరంతర ప్రక్రియ..

టేకులపల్లి: రెండో రోజు మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఓల ఆధ్వర్యంలో బద్దుతండా, పెగళ్లపాడు, బేతంపూడి, గోల్యాతండా, బిల్లుడు తండా, లచ్చగూడెం, కిష్టారం, కొత్తతండా(జి), శంభునిగూడెం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. రెండోరోజు కూడా గ్రామసభల్లో గందరగోళం నెలకొంది. లబ్ధిదారుల జాబితాపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ ఉన్నవాళ్ళకే పథకాలు ఇస్తారా, పూరి గుడిసెల్లో జీవిస్తున్న నిరుపేదలు కనిపించడం లేదా అంటూ అధికారులను ప్రశ్నించారు. అర్హుల జాబితాలో మా పేర్లు ఎందుకు లేవని నిలదీశారు. అధికారులు మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందొద్దని మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. గురువారం మండలంలోని తావుర్యాతండా, చంద్రుతండా, గొల్లపల్లి, మద్రాస్‌తండా, బోడు, రామచంద్రునిపేట, చింతలంక, తొమ్మిదో మైలుతండా, కొత్తతండా(పి) పంచాయతీల్లో గ్రామసభలు జరగనున్నాయి.



బేతంపూడిలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళ

• రెండో రోజూ ఆందోళనలు..

పాల్వంచరూరల్: ప్రజాపాలన గ్రామసభల్లో రెండో రోజు కూడా ప్రజలు అర్హుల జాబితాలో పేర్లు లేవని ఆందోళన నిర్వహించారు. మల్లారం, ఉల్వనూరు, రెడ్డిగూడెం, పునుకుల, పుల్లాయిగూడెం, లక్ష్మీదేవిపల్లి, నాగారం, బిక్కుతండా, నారాయణరావుపేట, పాయాకారియానంబైల్, సంగం, యానంబైల్, సోములగూడెం గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. అధికారులు చదివి వినిపించిన జాబితాలో అర్హత లేనివారికి మంజూరు చేశారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు అర్హులైన నిరుపేదల మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని ప్రత్యేకాధికారులు చెప్పడంతో ఆందోళనలు సద్దుమణిగాయి. నాగారంలో గ్రామసభ రసాభాసగా సాగింది. అధికారులు ప్రకటించిన జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ వివేక్ రీ సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు.



రీసర్వే చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

జాబితాలో పేరు లేకుంటే ఆందోళన వద్దు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

ఇల్లెందురూరల్: అర్హుల జాబితాలో పేరు లేకుంటే ఆందోళన అవసరం లేదని, వెంటనే దరఖాస్తు చేసుకుంటే విచారించి జాబితాను సరిచేస్తారని జెడ్పీ సీఈఓ బొగ్గుల నాగలక్ష్మి సూచించారు. మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామసభను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హుల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి జాబితాలో చోటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఆర్ఐ ముత్తయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కల్తి పద్మ, జానీ పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గట్టాయిగూడెం, ప్రశాంతినగర్ కాలనీ, కరకవాగు ప్రాంతాల్లో బుధవారం వార్డు సభలు నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ.. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, మేనేజర్ ఎల్‌వీ.సత్యనారాయణ, ఏఈ రాము, కొండం వెంకన్న, పైడిపల్లి మహేశ్, తుమ్మల శివారెడ్డి, పైడిపల్లి మనోహర్, వెంకటాచారి, కాపా శ్రీనివాసరావు, వీరకుమార్ షఫీ, శాంతివర్ధన్, మురళీ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయండి..



ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం తండాలో అర్హులైన నిరుపేదలకు ప్రజాపాలన గ్రామసభలో అధికారులు ప్రకటించిన జాబితాలో అర్హులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

షరతులు లేకుండా ‘సంక్షేమం’ అందించాలి



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: అర్హులైన నిరుపేదలందరికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి బంధ్రుగొండ గ్రామంలో బుధవారం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రకటించిన అర్హత జాబితాలో సాంకేతిక కారణాలతో అనేక మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా పథకాల జాబితాలో పేర్లు రాలేదన్నారు. అధికారులు పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా సర్వే నిర్వహించాలని కోరారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, ముత్యాల కిరణ్‌కుమార్, కంటే సీతారాములు, మల్లికార్జున్, వెంకటయ్య, వీరేష్, రమణయ్య, నాగేషు, గోవర్ధన్, పద్మ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 31న ఇల్లెందులో జరగనున్న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రగతిశీల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ అనుబంధ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జీతాలతోపాటు, పెనాల్టీలు, సీఎంపీఎఫ్, సోలార్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ తదితర డిపార్ట్‌మెంట్లలో లాభాల వాటాతోపాటు, పలు సమస్యలు చర్చించనున్నట్లు తెలిపారు. ఆర్.మధుసూదన్‌రెడ్డి, సీవై పుల్లయ్య, సతీష్, చంద్రశేఖర్, జాన్, రాజశేఖర్, సంజీవరెడ్డి, శరత్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కండి..



మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేశ్

టేకులపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కంచర్ల వెంకటేశ్ పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్‌లో భాగంగా బుధవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కోయగూడెం ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనుమానితులను పరీక్షించి వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఇల్లెందు డివిజన్ క్షయ నివారణాధికారి శంకర్, గ్రామ కార్యదర్శి వసంతరావు, సూపర్‌వైజర్లు గుజ్జ విజయ, కౌసల్య సింగ్, పోరండ్ల శ్రీనివాస్, నాగు బండి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం రమాకుమారి, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు నిర్మల, శారద, జ్యోతి, కళావతి, అచ్చమ్మ, బిగిని పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్‌లో 120 మంది అన్‌ఫిట్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రధానాస్పత్రిలో ఈనెల 21, 22వ తేదీలలో 120 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో 209 మంది కార్మికులను బోర్డ్ నిర్వాహకులు పిలవగా, వారిలో 47 మంది గైర్హాజరు అయ్యారు. 23 మందిని హయ్యర్ రిఫరల్‌కు, 10 మందిని ఫిట్‌ఫర్ సేమ్ జాబ్, 9 మందిని అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు ఎంపిక చేశారు. మిగిలిన 120 మందిని అన్‌ఫిట్ చేశారు.

ఓవర్‌మెన్ వెబ్ కౌన్సెలింగ్ నిలిపివేత



మైనింగ్ సర్దార్ అభ్యర్థులతో చర్చిస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ దశలవారీ ఆందోళనల కార్యక్రమాల నేపథ్యంలో దిగివచ్చిన యాజమాన్యం ఓవర్‌మెన్ వెబ్ కౌన్సెలింగ్‌ను నిలిపివేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. రుద్రంపూర్‌లో జరిగిన మైనింగ్ సర్దార్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో అపాయిమెంట్ అయిన జేఎంఈటీలకు 2023 మార్చిలో సుమారు 350 మందికి రావాల్సిన ఓవర్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వకుండా ఇప్పుడు 160 మందికి ప్రమోషన్లు ఇచ్చి, అందులో కూడా తేదీలు మార్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జి.నవీన్, బండి సాయి, డి.శివ, గౌతమ్, పృథ్వీ, మూడు వెంకటేష్, జుబేర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

పాల్వంచ: తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల్లో సుమారు 20వేల మందికి పైగా ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారని, విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సీపీఎం నాయకులు బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కన్వర్షన్ చేయడం వల్ల సంస్థలపై ఎలాంటి ఆర్థిక భారం పడదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరించడం బాధాకరం అన్నారు. విద్యుత్ సంస్థలకు గుండెకాయ లాంటి ఆర్టిజన్ల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. విద్యార్హతలను బట్టి అందుకు తగిన పోస్టులు ఇవ్వాలని, స్టాండింగ్ ఆర్డర్ల ప్రకారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంక్రిమెంట్, గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, కె.సత్య, అంకిరెడ్డి నరసింహారావు, శ్రీనాథ్, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావును సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల చిరకాల కోరిక నెరవేర్చాలని, సొంతింటి పథకం అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఈ విషయమై కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలందరికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. ఈ పథకం అమలు చేస్తే, సంస్థకు ఆర్థిక భారం తగ్గుతుందని, తద్వారా సింగరేణికి దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. మందా నర్సింహారావు, గాజుల రాజారావు, విజయగిరి శ్రీనివాస్‌రావు, వై.వెంకటేశ్వరరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



సెంట్రల్ వర్క్‌షాపులో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జీఎం దామోదర్, అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపులో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ న్యూఇయర్ క్యాలెండర్లను వర్క్‌షాపు జీఎం దామోదర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... సింగరేణి సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల సాధనకు అసోసియేషన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఉద్యోగుల ప్రమోషన్ భర్తీల విషయంలో యాజమాన్యంతో కొట్లాడి వారి సమస్యల సాధన కోసం పారిశ్రామిక సమస్యలు తలెత్తకుండా సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరలో సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొరిమి రాజ్‌కుమార్, వంగా వెంకట్, రమణమూర్తి, జిమ్మిడి మల్లేష్, తుమ్మ శ్రీనివాస్‌రావు, అమరేందర్, సకినాల సమ్మయ్య, సుమన్, నారాయణ, రవి, పరమేష్, ప్రభాకర్, సోమరెడ్డి, బాలకృష్ణ, రామ్‌శంకర్, అరుణ్, లింగం, శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.